క్లుప్తంగా

కాళ్లకూరు వెంకన్నకు పుష్పోత్సవం

కాళ్ల: కాళ్ళకూరులో వేంచేసి ఉన్న స్వయంభు వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ ,అమ్మవార్లకు లక్ష కుంకుమ పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా వేద పండితులు, అర్చక స్వాములు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 400 కేజీల 16 రకాల సుగంధ పరిమళ పుష్పాలతో స్వామివారికి పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి హాజరైన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

మోగల్లు హైస్కూల్ హెచ్ఎంపై విచారణ

పాలకోడేరు: కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, తోటి ఉపాధ్యాయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు డీవైఈవో మోగల్లు హైస్కూల్ హెచ్ఎం ఎం త్రినాథరావును సోమవారం విచారించారు. హెచ్ఎం వాంగ్మూలం తీసుకున్నామని, విచారణ ఇంకా పూర్తి కావాల్సి ఉందని డీవైఈవో శ్రీరామ్ తెలిపారు.

అందరివాడు సీఎం జగన్

ఆకివీడు: అర్హతే ప్రామాణికంగా పథకాలు అందరికీ అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరివాడని క్రిస్టియన్ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రత్నకుమార్ చెప్పారు. స్థానిక 12వ వార్డులో కొత్త పింఛన్లను లబ్ధిదారులకు సోమవారం వార్డు కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు.

మహిళలకు గ్యాస్ కనెక్షన్లు

పాలకోడేరు: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన మహిళలకు గ్యాస్ సిలిండర్, స్టవ్ ఉచితంగా అందిస్తోందని ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం విస్సాకోడురులో 60 మందికి, ఉచితంగా హెచ్‌పీ గ్యాస్ కనెక్షణ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, ఎంపీటీసీ బొల్లం గాంధీ ఉన్నారు.

భీమవరంలో రూ.100 కోట్ల అభివృద్ధి

- 10న వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్, 14న తాడేరు వంతెన ప్రారంభం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


37వ వార్డులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

భీమవరం: భీమవరం పట్టణంలో గత నాలుగున్నరేళ్లుగా రూ.100 కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని, త్వరలో మరిన్ని అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ నిర్వహించనున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈనెల 10వ తేదీన వాటర్ ఫిల్టర్ నేషన్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటివరకు పట్టణానికి కోటి లీటర్ల నీటిని సరఫరా చేస్తున్న నేపథ్యంలో, ఈ ప్లాంట్ ప్రారంభం అనంతరం తాగునీటి సామర్థ్యం కోటి లీటర్ల నుంచి రెండు కోట్ల 70 లక్షల లీటర్లకు చేరుతుందని చెప్పారు. పట్టణమంతా ఒకే సమయంలో మంచినీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమృత పథకంలో రెండో ఫేజ్‌లో రూ.48 కోట్ల నిధులు మంజూరయ్యాయని, 2053 వరకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో అవసరమైన చోట ఓహెచ్ఆర్‌లను, పైపులైన్లు వేస్తామని చెప్పారు. ఇప్పటికే 4, 39, 31వ వార్డుల్లో నిర్మించిన మంచినీటి రిజర్వాయర్లను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. తాడేరు నూతన వంతెనను ఈనెల 14న ప్రారంభిస్తామని తెలిపారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుందని గుర్తించి తాను 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన వంతెన పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. రెండేళ్ల పాటు కరోనా వల్ల రాష్ట్ర ఖజానాలోటు బాగా పెరిగినప్పటికీ సీఎం జగన్ ఎక్కడా వెనుకడుగు వేయకుండా 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమం, అభివృద్ధి చేశారని వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, ఎంఈ త్రినాథరావు, ఆర్అండ్‌బీ డీఈ రామరాజు, మున్సిపల్ డీఈ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్ల ప్రారంభం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో రూ.73 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. తొలుత టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్క నుంచి జువ్వలపాలెం రోడ్డు వరకు రూ.23 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, అనంతరం 37వ వార్డులో టౌన్ రైల్వే స్టేషన్ వద్ద చెక్కా వారి వీధిలో రూ.32.60 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, సీసీ డ్రెయిన్‌ను, రూ.17.50 లక్షల నిధులతో గోవర్ధన్ టాకీస్ రోడ్డులో రాఘవేంద్ర కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు వరకు నిర్మించిన ఆర్‌సీసీ శ్లాబ్ కల్వర్టు, సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్‌ను ఆయన ప్రారంభించారు.

చేతివృత్తి కార్మికులకు పీఎం విశ్వకర్మ మంచి అవకాశం

ఉండి: చేతి వృత్తుల వారికి ఎంపీ విశ్వకర్మ పథకం మంచి అవకాశం కనుక దానిని వినియోగించుకోవాలని ఐఎస్‌డీఎస్ డైరెక్టర్, ఎస్ఐఎంఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొప్పర్తి శ్రీనివాసరావు అన్నారు. ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్, పీఎం విశ్వకర్మ పథకం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు టైలరింగ్, కార్పెంటర్లకు ఐదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వం ఐటీఐలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్‌డీఎస్‌డీఈ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌మౌళి, ఎస్ఎస్‌డీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ పీ శాంతను, జిల్లా డీఎస్‌డీఓ ఏ కృష్ణారెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ వీ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

జూదాలకు పాల్పడడం నేరం

వీరవాసరం: ప్రజలందరూ సంక్రాంతి పండుగను ఆహ్లాదకర వాతావణంలో నిర్వహించుకోవాలని తహసీల్దార్ ఎం.సుందర్రాజు, ఎస్సై పి.రమేష్ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, జూదాల నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. జూదాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొక్కలే జీవనాధారం

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉన్నవ్ భారత్ అభియాన్ రీజినల్ కోఆర్డినేటర్ బి.పావని అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో హైస్కూల్లో సోమవారం డీఎన్నార్ కళాశాలలోని ఉన్నవ్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఉప సర్పంచ్ బుద్ధాల రామకృష్ణ, కార్యదర్శి భవాని, వి.ప్రవీణ్, ఉండపల్లి గణేష్ పాల్గొన్నారు.

కదం తొక్కిన ఆటో కార్మికులు


భీమవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

భీమవరం: జిల్లాలో వివిధ పట్టణాల్లోని ఆటో కార్మికులందరూ సోమవారం ఉదయం నుంచి నిరసన వ్యక్తం చేశారు. ఏపీఎస్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామనడం ఆటో కార్మికుల పొట్ట కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన భీమవరంలో 28 ఆటో యూనియన్లు సంయుక్తంగా సమస్యలపై నినదించారు. ప్రకాశం చౌక్ సెంటర్లో సుమారు రెండు వేల మంది ఆటో కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ, భీమవరం పట్టణ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పంపన గోపి, ఆరేపల్లి బాలాజీ, గోపాల్ కుమార్, సతీష్, జగన్‌మోహన్‌రావు, గుల్లిపల్లి శ్రీను, సురేష్ స్వామి, వెంకట రమణ, శ్రీను, ములుగుర్తి కృష్ణ, రవి, శివ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని వినతి

కాళ్ల: ఆటో డ్రైవర్లను ఆదుకోవాలంటూ జువ్వలపాలెం ఆటో యూనియన్ సభ్యులు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజుకు వినతిపత్రం అందజేసారు. కాళ్ల మండలం పెద అమీరంలో సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లంతా ఇబ్బంది పడతారని వారు వాపోయారు. అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఆటో డ్రైవర్ల జీవితాలకు భరోసా కల్పించాలని కోరారు.

బంద్ పాటించిన ఆటోలు

ఆకివీడు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వంటి వాటితో ఆటో కార్మికుల పొట్ట కొట్టవద్దని సోమవారం ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బంద్ పాటించారు. ఈ సందర్భంగా పలువురు ఆటో వర్కర్లు, యజమానులు ర్యాలీ నిర్వహించారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేద్దాం


39వ వార్డులో మాట్లాడుతున్న భోగయ్య

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక 39వ వార్డులో వార్డు ఇన్‌చార్జి కొల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ రాష్ట్రానికి మళ్లీ జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత డిస్‌ప్లేను ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో కోడే యుగంధర్, గంటా సుందర్ కుమార్, రేవూరి గోగురాజు, మానేపల్లి నాగన్నబాబు, పాలివేలి మంగ, చెల్లబోయిన సూర్యప్రకాష్, కందికట్ల ఎడ్వర్డ్, కరీముల్లా బాషా, పిల్లి మునలయ్య, గుంటి ప్రభు, పాలపర్తి జోనా, కానబోయిన వెంకటరమణ, వేంద్ర విజయ దుర్గ, కనుమూరి విజయదుర్గ, ముత్యాల బుజ్జి, వేంద్ర జయరాం, నందమూరి ఆంజనేయులు, అల్లూరి రాజేష్, ఇంటి సత్యనారాయణ, తుళ్లూరు చంటి, పైపూరి సూరిబాబు, మెట్ట మురళి, ఉద్దరాజు రామకృష్ణ వర్మ, కైలా పాండురంగారావు, బొత్స ధర్మ, స్వరపల్లి శ్రీను సచివాలయం సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



భీమవరంలో విస్తరిస్తున్న వైద్యరంగం


భీమవరం వ్యూ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణం ఆక్వా రంగంతోపాటు వ్యాపార, వైద్య రంగాల్లో మరింతగా విస్తరిస్తోంది. విజయవాడ, విశాఖపట్టణంలో మాదిరిగానే భీమవరంలో అన్ని ప్రముఖ వ్యాపార సంస్థల బ్రాంచ్‌లు ఉన్నాయి. వస్త్రషాపుల నుంచి బ్రాండెడ్ కార్లు, బంగారం షోరుంలు భీమవరంలో ఉన్నాయి. పెళ్లిళ్లకు, పంక్షన్లకు, పండగలకు వస్త్రాలు, బంగారం ఏదైనా కొనాలంటే మరో ప్రాంతానికి వెళ్లే పని లేకుండా అన్నీ ఇక్కడే లభించడం భీమవరం ప్రత్యేకత. షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్, ప్రముఖ విద్యాసంస్థలు, 30 అడుగుల అల్లూరి సీతారామరాజు విగ్రహం, మావుళ్లమ్మవారు, పంచారామక్షేత్రం, అతిపెద్ద చర్చి రూపాంతర ఆలయం తదితర వాటితో భీమవరంతో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది.

ఆధునిక ఆస్పత్రులకు నిలయం

వైద్య రంగంలోనూ భీమవరం ముందుజలో ఉంది. ఆధునిక వైద్య సౌకర్యాలతో అనేక ఆస్పత్రులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. క్యాన్సర్ వైద్యం కూడా ఇక్కడ అందుబాటులో ఉంది. గతంలో పెద్దపెద్ద అనారోగ్య సమస్యలు వస్తే విజయవాడ, హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేంది. నేడు హైదరాబాద్ నుంచే వైద్యులు భీమవరం వచ్చి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు.

మంచి భోజనానికి చిరునామా

మంచి భోజనం అంటే గుర్తుకొచ్చేంది భీమవరం. రాజకీయ, సినీ, ప్రముఖులతో పాటు ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాల వారు సైతం భీమవరం ఫుడ్ అంటే ఇష్టపడతారు. భీమవరం నాన్‌వెజ్ ఫుడ్, నాన్‌వెజ్ పచ్చళ్లకు పెట్టింది పేరు. ఇక్కడ నాన్‌వెజ్ పచ్చళ్లు ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలకు వెళుతుంటాయి. ఇలా అన్ని రంగాల్లో భీమవరం విస్తరించడం శుభపరిణామం.

వైద్య రంగంలో ముందంజ



భీమవరంలో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందింది. మల్టీస్పెషల్టీ వైద్య సేవలు చాలా కాలంగా అదుబాటులోకొచ్చాయి. అధునిక వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండడంతో రోగులు దూర ప్రాంతాలక్కెళ్లే పనిలేకుండా సెప్షలిస్టుల వైద్య సేవలు పొందుతున్నారు. అరుదైన శస్త్రచికిత్సలు కూడా భీమవరం డాక్టర్లు చేస్తున్నారు. భీమవరం వైద్య రంగంలో దూసుకుపోతున్న నేపథ్యంలో అనేక కార్పొరేట్ ఆస్పత్రుల శాఖలు భీమవరంలో ఉన్నాయి.

– డాక్టర్ టి.శ్యామ్‌బాబు, ఆర్థోపెడిక్ వైద్యుడు, భీమవరం

భోజానికి పెట్టింది పేరు



భీమవరం అంటే భోజానికి పెట్టింది పేరు. భీమవరం నాన్‌వెజ్ భోజనం, నాన్‌వెజ్ పచ్చళ్లు అంటే సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులకు ఎంతో ఇష్టం. భీమవరం పచ్చళ్లు ప్రపంచ దేశాలకు వెళ్తతున్నాయంటే భీమవరానికే గర్వకారణం. జిల్లాకు వచ్చి ప్రముఖులు భీమవరంలో బస చేసి ఇక్కడ భోజనం చేస్తేనే సంతృప్తి చెందుతున్నారు. దేశంలో ఎక్కడికెళ్లినా భీమవరం పేరు చెబితే గుర్తుకొచ్చేది సంక్రాంతి కోడి పందాలు, నాన్‌వెజ్ పచ్చళ్లు, రొయ్యల చెరువులు.

– మంతెన కృష్ణంరాజు, వెంపరాజు వంటిల్లు, భీమవరం

అగ్నిప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆకివీడు: చెరుకుమిల్లి శివారు కమతవానిగూడెంకి చెందిన చుక్కా శ్రీనివాస్ ఈ నెల 7వ తేదీ రాత్రి 8 గంటలకు ఇంట్లో గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా మంట వ్యాపించి చొక్కాకు నిప్పు అంటుకోవడంతో గాయాలపాలైనట్టు ఎస్సై నాగాబాబు చెప్పారు. బాధితుడు శ్రీనివాస్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు ఎస్సై చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

ఆకివీడు: చెరుకుమిల్లిలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తుల్ని సోమవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగాబాబు చెప్పారు.

మహిళకు గాయాలు

ఆకివీడు: స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతంలో నివసిస్తున్న ముగ్గురు మహిళలు సోమవారం వాగ్వాదానికి దిగి ఒకరినొకరు తోసుకోవడంతో చిన్ని తులసి రామలక్ష్మీ చేతికి గాయమైంది. ఆమె భీమవరం చికిత్స కోసం ఆసుపత్రిలో చేరినట్లు ఎస్సై నాగబాబు సోమవారం చెప్పారు. ఆసుపత్రి నుంచి ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అక్రమ మద్యం స్వాధీనం

పాలకోడేరు: విస్సాకోడేరులో సామంతుల లక్ష్మి అక్రమ మద్యం విక్రయిస్తుండగా సోమవారం దాడి చేసి ఆమె వద్ద నుంచి రూ.1,200 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

తండ్రీ, కొడుకులపై దాడి

పాలకోడేరు: తండ్రీ, కొడుకులపై చాకుతో దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాళం శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే శృంగవృక్షం గ్రామ పంచాయతీ పరిధిలోని బంటుమిల్లికి చెందిన దొంగ దుర్గాంజనేయులు, అతడి తండ్రిపై అదే గ్రామానికి చెందిన బండి విఘ్నేష్ చాకుతో దాడి చేసి గాయపర్చాడు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు దుర్గాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విఘ్నేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్సై తెలిపారు.













